సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025



ఉగ్రదాడిపై నిరసన

కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు. దిష్టిబొమ్మలు దహనం చేశారు. 11లో



క్రీడలు లేని ప్రాంగణాలు

జిల్లావ్యాప్తంగా క్రీడా ప్రాంగణాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కిట్లు పంచాయతీలకే పరిమితమయ్యాయి. 10లో



వాతావరణం

జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్య కల్యాణం.. కమనీయం



స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భ గుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి వైభవంగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో గురువారం అర్చకులు అమ్మవారికి 108 సువర్ణ పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం, నివేదన పూజలు జరిపారు. పూజా కార్యక్రమంలో అర్చకులు, వేదపడింతులు, భక్తులు పాల్గొన్నారు.

రేపు రుద్రహోమం

మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శనివారం రుద్రహోమ పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు వరకు హోమం జరుగుతుందని పేర్కొన్నారు. పాల్గొనే భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాలను నమోదు చేసుకోవాలని, వివరాలకు 63034 08458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లా పరిధిలోని ఆస్పత్రులు, ప్రాంతీయ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో పని చేసేందుకు వైద్యుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేట, మణుగూరు ఆస్పత్రుల్లో జనరల్ సర్జన్ వైద్య నిపుణులు, ఇతర ఆస్పత్రులలో డెర్మటాలజిస్టులు, భద్రాచలం, బూర్గంపాడులలో ఎంబీబీఎస్ వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే నెల 5వ తేదీ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

పలువురు సీఐల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని పలువురు సీఐలను బదిలీలు చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. కొత్తగూడెం డీసీఆర్బీలో విధులు నిర్వర్తిస్తున్న సీఐ మడిపెల్లి నాగరాజును భద్రాచలం టౌన్ ఎస్‌హెచ్‌ఓగా, కొత్తగూడెం సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న పింగిలి నాగరాజును అశ్వారావుపేట సర్కిల్‌కు బదిలీ చేశారు. తాటిపాముల కరుణాకర్‌ను అశ్వారావుపేట నుంచి బదిలీ చేస్తూ హైదరాబాద్ మల్టీజోన్-1 ఐజీపీకి రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: ఈ నెల 10న భద్రాచలం సీఐ బర్పాటి రమేష్ ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యారు. దీంతో దీంతో 15 రోజుల నుంచి అక్కడ సీఐ పోస్టు ఖాళీగా ఉండగా, ఆ స్థానంలో నాగరాజును నియమించారు. నేడు ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

సీతాపతి.. కరోడ్‌పతి!





భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారి కల్యాణ మహోత్సవ ఆదాయం లెక్క తేలింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 6,7వ తేదీల్లో శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక ఉత్సవాలు నిర్వహించిన విషయం విదితమే. వేడుకల్లో టికెట్లు, తలంబ్రాలు, లడ్డూల అమ్మకాలు, పరోక్ష సేవల ద్వారా రామయ్యకు భారీగా ఆదాయం సమకూరింది. గతేడాది కంటే గణనీయంగా పెరిగింది. ఆ లెక్కలను ఆలయ అధికారులు గురువారం వెల్లడించారు. –భద్రాచలం

గణనీయంగా పెరిగిన శ్రీరామనవమి ఆదాయం

- భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారికి రూ.2.69 కోట్ల రాబడి
- ముత్యాల తలంబ్రాల విక్రయాలకు విశేష ఆదరణ

ఈ ఏడాది రూ.2.69 కోట్లు..

ఈ ఏడాది రామయ్యకు నవమి ఆదాయం భారీగా పెరిగింది. అన్ని విభాగాల్లో కలిపి రూ.2,69,09,390 సమకూరింది. ఇందులో అధికంగా సెక్టార్ల టికెట్ల విక్రయం ద్వారానే రూ.1,32,83,000 వచ్చింది. చిన్న లడ్డూల అమ్మకం ద్వారా రూ.49,07,775, మహా లడ్డూల ద్వారా రూ.2,89,000 సమకూరింది. ఇక తలంబ్రాల అమ్మకంలో పోస్టల్ ద్వారా రూ.6,64,225, ఆర్టీసీ కార్గో ద్వారా 41,09,200, ఆలయ వెబ్‌సైట్ ద్వారా 5,06,750, ఆలయ ప్రచార శాఖ ద్వారా 13,87,050 ఆదాయం వచ్చింది. ఆన్‌లైన్‌లో పరోక్ష సేవల ద్వారా 5,02,200, రూ.5 వేల పరోక్ష సేవల ద్వారా రూ. 3 లక్షల 45 వేల ఆదాయం చేకూరింది. పోస్టల్ శాఖ ద్వారా చేపట్టిన అంతరాలయ అర్చనకు భారీ స్పందన లభించింది. 2702 బుకింగ్‌లతో రూ.8,78,150 నిధులు సమకూరాయి.

గతేడాది కంటే రూ.80 లక్షలు అదనం

శ్రీరామనవమికి 2024లో వచ్చిన ఆదాయం కంటే ఈ ఏడాది ఆదాయం పెరగం విశేషం. గతేడాది సుమారు రూ. కోటి 89 వేల 61 వేలు రాగా ఈ ఏడాది అదనంగా సుమారు రూ. 80 లక్షల ఆదాయం పెరిగింది. ఇందులో సెక్టార్ల టికెట్ల విక్రయం ద్వారా సుమారు రూ.10 లక్షల ఆదాయం పెరిగింది. గతేడాది ముత్యాల తలంబ్రాల విక్రయం ద్వారా కేవలం రూ. 30 లక్షలు రాగా, ఈ ఏడాది రూ.66 లక్షల 67 వేల 225 ఆదాయం సమకూరింది. పోస్టల్ శాఖ ద్వారా బుకింగ్ చేసిన అంతరాలయ అర్చన ఆదాయం కూడా పెరిగింది. గతేడాది కేవలం రూ.91 వేలు ఉండగా ఈ ఏడాది రూ.8,78,150కు పెరిగింది. ఇందులో సీఎం, వీవీఐపీ సెక్టార్ల కోసం ఉభయ దాతల టికెట్లను తగ్గించారు. దీనివల్ల సుమారు రూ.16 లక్షల ఆదాయానికి గండి పడింది. దీంతోపాటు మరికొన్ని పొదుపు చర్యలను పాటించి ఉంటే ఆదాయం సుమారు రూ. 3 కోట్లకు చేరేది.

పెరిగిన ముత్యాల తలంబ్రాల అమ్మకాలు..

ప్రతీ ఏడాది ముత్యాల తలంబ్రాలకు భక్తుల నుంచి ఆదరణ లభిస్తోంది. దేవస్థానం కౌంటర్లు, ప్రచార శాఖలతోపాటు ఆర్టీసీ కార్గో, పోస్టల్ శాఖల ద్వారా తలంబ్రాలు విక్రయిస్తున్నారు. దీంతో దేవస్థానంతోపాటు ఆర్టీసీ, పోస్టల్ శాఖలకు కూడా ఆదాయం సమకూరుతోంది. గతేడాది ఆర్టీసీ కార్గో ద్వారా 46,400 ప్యాకెట్లను అమ్మగా, ఈఏడాది లక్షా 64 వేల 368 ప్యాకెట్లను విక్రయించారు. సుమారు 80 వేల ప్యాకెట్ల అదనంగా అమ్మకం చేశారు. పోస్టల్ శాఖ ద్వారా గతేడాది 2,531 ప్యాకెట్లు విక్రయించగా, ఈ ఏడాది 26,569 ప్యాకెట్లను అమ్మారు. దేవస్థానం ప్రచార శాఖ ద్వారా గతేడాది 31,518 కాగా, ఈ ఏడాది 55,482 ప్యాకెట్లను విక్రయించారు. ముత్యాల తలంబ్రాలు, దేవస్థాన కేలండర్లు, డైరీలు, వివిధ పుస్తకాలను అన్ని శాఖల ద్వారా ఏడాదంతా భక్తులకు అందుబాటులో ఉంచితే మరింత ఆదరణ లభించే అవకాశం ఉంది.

పుస్తకాలు వస్తున్నాయ్..

- జిల్లాకు చేరిన మొదటి విడత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం క్లాత్
- స్టిచ్చింగ్ పనులు చేపడుతున్న మహిళా సంఘాలు
- ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభం నాటికి అందించే అవకాశం



కొత్తగూడెం గోదాంలో పుస్తకాలను సర్దుతున్న అధికారులు



యూనిఫాం కుడుతున్న మహిళ

కొత్తగూడెంఅర్బన్: 2025–2026 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించే లక్ష్యంతో విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే జిల్లాకు మొదటి విడత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం క్లాత్ చేరుకుంది. పాఠ్యపుస్తకాలను జిల్లా కేంద్రంలోని పాతకొత్తగూడెం స్కూల్‌లో భద్రపరిచారు. మిగతా విడతల్లో కూడా వచ్చే పుస్తకాలను గోదాంలో ఉంచి, మే చివరిలోగా మండల కేంద్రాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పంపించనున్నారు. పాఠశాలల పునఃప్రారంభనాటికి విద్యార్థులకు కొత్త యూనిఫాం అందించనున్నారు. మొదటి విడతగా యూనిఫాం సంబంధించిన బాటమ్ క్లాత్ చేరుకోగా, మహిళా సంఘాల సభ్యులకు స్టిచ్చింగ్ నిమిత్తం అందజేశారు. వారు యూనిఫాం కుట్టే పనిలో నిమగ్నమయ్యారు. ఏటా విద్యార్థులకు రెండు జతల యూనిఫాం అందజేస్తున్నారు. గతేడాది ఒక్కో యూనిఫాంకు స్టిచ్చింగ్ చార్జీ రూ.50 చొప్పున అందజేయగా, ఈసారి రూ.75కు పెంచారు. రెండు జతలు కుట్టినందుకు రూ.150 అందించనున్నారు. పట్టణాల్లో మెప్మా, మండలాల్లో సెర్ప్ సిబ్బంది స్టిచ్చింగ్ పనులను పర్యవేక్షిస్తున్నారు. కాగా యూనిఫాం చొక్కాల క్లాత్ రెండో దశలో రానుందని అధికారులు తెలిపారు.

గోదాంకు చేరిన 1,10,200 పాఠ్యపుస్తకాలు

జిల్లాకు రానున్న విద్యాసంవత్సరంలో 5,08,400 పాఠ్యపుస్తకాలు అవసరం ఉంది. మొదటి విడతగా 1,10, 200 పుస్తకాలు చేరాయి. ఇంకా 3,98, 200 పుస్తకాలు రావాల్సి ఉంది. వచ్చిన పుస్తకాలను కొత్తగూడెం గోదాంలో భద్రపరిచారు. దీంతోపాటు మొదటి విడతలో యూనిఫాంలో ప్యాంట్‌కు సంబంధించిన క్లాత్ 2,50,060.45 మీటర్లు అందజేశారు.

పుస్తకాలు వస్తున్నాయి..



జిల్లాకు మొదటి విడతగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం క్లాత్ వచ్చింది. పాఠ్యపుస్తకాలను కొత్తగూడెం గోదాంలో భద్రపరిచాం. మిగతా పుస్తకాలు వచ్చాక మండలాలకు, అక్కడి నుంచి పాఠశాలలకు పంపించి విద్యార్థులకు అందజేస్తాం. యూనిఫాం క్లాత్‌కు సంబంధించి బాటమ్ క్లాత్ మాత్రమే వచ్చింది. ఆ క్లాత్ స్టిచ్చింగ్ పనులు జరుగుతున్నాయి. – ఎం.వెంకటేశ్వరాచారి, డీఈఓ

స్టిచ్చింగ్ మొదలు పెట్టాం



జిల్లాకు వచ్చిన యూనిఫాం క్లాత్ స్టిచ్చింగ్ పనులను మహిళా సంఘాలకు అప్పగించారు. బాటమ్ క్లాత్ మాత్రమే వచ్చింది. దానికి సంబంధించిన కటింగ్ పనులు జరుగుతున్నాయి. అనంతరం స్టిచ్చింగ్ పనులు నిర్వహించి, సంబంధిత అధికారులకు అందజేస్తాం. జత యూనిఫాంకు రూ.75 చెల్లించడం హర్షణీయం. – శ్రీలత, మహిళా సంఘం సభ్యురాలు

విద్యాలయాలను సుందరంగా తీర్చిదిద్దాలి

భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్



చర్లలోని ఎస్టీ బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న పీఓ రాహుల్

చర్ల/దుమ్ముగూడెం: వేసవి సెలవుల అనంతరం తిరిగి ప్రారంభమయ్యే నాటికి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను సుందరంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గురువారం చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలను, వసతి గృహాలను ఆయన ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పాఠశాలల్లో కల్పించాల్సిన వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రధానోపాధ్యాయులు, టీచర్లు, వార్డెన్‌లు ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయంతో పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. డార్మెటరీ, డైనింగ్ హాల్, అదనపు తరగతి గదులు, టాయిలెట్, బాత్రూం ఇతర మౌలిక వసతులకు నెల రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. 15 రోజుల్లోగా ప్రీ ఫ్యాబ్రికేటెడ్ డైనింగ్ హాల్ ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. వేసవి సెలవుల్లో పాఠశాలలు అపరిశుభ్రంగా ఉంచకుండా రోజూ శుభ్రం చేయించాలని చెప్పారు. హెచ్‌ఎం సావిత్రి, డీఈ హరీష్, ఏఈ రవి, టీఏ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడవులను కాపాడుకుందాం

విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుందర్‌రెడ్డి



ప్లాంటేషన్‌లో పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుందర్‌రెడ్డి

చండ్రుగొండ : అడవులను కాపాడుకోవడం అందరి బాధ్యతగా భావించాలని విజిలెన్స్ డీఎఫ్‌ఓ ముకుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చంద్రుగొండ రేంజ్ పరిధిలో బెండాలపాడు అటవీప్రాంతంలో గురువారం ఆయన పర్యటించారు. మారుజాతి ప్లాంటేషన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అడవులను నాశనం చేసుకుంటే భవిష్యత్ తరాలకు మనుగడ ఉండదని హెచ్చరించారు. ఆయన వెంట రేంజర్ ఎల్లయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేద్దాం

పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పులగం దామోదర్‌రెడ్డి సూచించారు. ఖమ్మంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అధ్యక్షతన గురువారం జరిగిన ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేలా నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం హర్షణీయమన్నారు. ఈమేరకు ఉపాధ్యాయులు కూడా తమ వంతు పాత్ర పోషించాలని తెలిపారు. కాగా, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలు, పీఆర్సీ మంజూరుకు ఇప్పటికే సీఎంను కలిశామని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రంగారావుతో పాటు మోత్కూరు మధు, కందుల వెంకటనరసయ్య, విజయ్ అమృత్, ఆర్.బ్రహ్మరెడ్డి, కట్ట శేఖర్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆఫ్‌టైప్ ఆయిల్‌పామ్ మొక్కల పరిశీలన



మొక్కలను పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్, అధికారులు

అశ్వారావుపేటరూరల్/ములకలపల్లి: ఆఫ్‌టైప్ మొక్కలు ఉన్న ఆయిల్‌పామ్ తోటలను రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అశ్వారావుపేట మండలం గంగారం, వాగొడ్డుగూడెం గ్రామాలు, ములకలపల్లి మండలం తిమ్మంపేట, పొగళ్లపల్లి గ్రామాల్లోని పామాయిల్ తోటల్లో ఉన్న ఆఫ్‌టైప్ మొక్కలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నర్సరీ నుంచి 2017–2022 మధ్య కాలంలో రైతులకు అందించిన ఆయిల్ పామ్ మొక్కల్లోనే ఆఫ్‌టైప్ మొక్కలు అత్యధికంగా ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. బాధిత రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే క్షేత్ర సందర్శన చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం రిటైర్డ్ ఐఐఓపీఆర్ అధికారి బీఎస్‌రావు మాట్లాడుతూ నర్సరీ దశలో చీడపీడలు సోకినా, పెంపకంలో నాణ్యతాలోపాలు ఉన్నా అనారోగ్యమైన మొక్కలు పెరిగే అవకాశం ఉంటుందని, వీటిని సకాలంలో గుర్తించి కల్లింగ్ చేయాల్సిందని వివరించారు. కానీ కల్లింగ్ ప్రక్రియ సక్రమంగా జరగలేదని తెలుస్తోందని తెలిపారు. డిప్యూటీ మేనేజర్ ప్రవీణ్ రెడ్డి, అధికారులు శంకర్, రాధాకృష్ణ, నాగబాబు, కల్యాణ్ పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు నష్టం ఉండదు

భూ భారతి చట్టం అవగాహన సదస్సుల్లో కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ములకలపల్లి: మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

ములకలపల్లి/జూలూరుపాడు: భూ భారతి చట్టంతో ఏజెన్సీలో ఆదివాసీల భూములకు ఏ మాత్రమూ నష్టం వాటిల్లదని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్పష్టం చేశారు. ములకలపల్లి, జూలురుపాడులలో గురువారం నిర్వహించిన భూ భారతి చట్టం అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన చట్టాలను గౌరవిస్తూనే స్థానిక భూ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కామారెడ్డి, నారాయణపేట, ఖమ్మం, ములుగు జిల్లాలో ప్రయోగాత్మకంగా భూభారతి సర్వే చేపడుతున్నట్లు వివరించారు. ధరణి పోర్టల్‌లోని లోపాలను సవరిస్తూ భూ భారతి చట్టం రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల భూములకు రక్షణతోపాటు భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు ఆందోళనలు, అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ధరణితో నష్టపోయారు..

అశ్వారావుపేట, వైరా ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మాలోత్ రాందాస్ నాయక్‌లు మాట్లాడుతూ భూభారతి ద్వారా రైతులకు తమ భూమిపై పూర్తి హక్కులు దక్కుతాయని తెలిపారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు నష్టపోయారని అన్నారు. ధరణి వల్ల మ్యానువల్ పహాణీ పొందే అవకాశం కోల్పోయారని, బ్యాంకులు రుణాలు పొందలేక పోయారచని, రుణమాఫీ కూడా వర్తించలేదన్నారు. కానీ భూ భారతి చట్టంతో అందరికీ మేలు జరుగుతుందని అన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డీఓ డి.మధు, తహసీల్దార్లు గుడ్ల పుల్లారావు, కె.స్వాతిబిందు, ఎంపీడీఓలు రేవతి, డి.కరుణాకర్ రెడ్డి, ఏడీఏలు, నరసింహారావు, రవికుమార్, ఏఓలు దీపక్ ఆనంద్, అరుణ్‌బాబు, ఎంపీఓ తులసిరామ్, ఎఫ్ఆర్ఓ జి.ప్రసాద్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మాళోత్ మంగీలాల్ నాయక్, తాండ్ర ప్రభాకర్‌రావు, నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, బానోత్ విజయాబాయి, పర్వతనేని అమర్‌నాథ్, కరుటూరి కృష్ణ, తిరుపతిరెడ్డి, ప్రసాద్, రాంబాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాను మాదకద్రవ్య రహితంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. గురువారం ఐడీఓసీలో నిర్వహించిన జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశంలో మాట్లాడారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించకుండా ఉండేలా కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. పేరెంట్స్ టీచర్ సమావేశాల్లో డ్రగ్స్, గంజాయి వినియోగం వల్లే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రులు, మెడికల్ షాపుల్లో స్టాక్ వివరాలను ప్రతి నెలా తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ శరత్, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ కరంచంద్, ఎక్సైజ్ సీఐ జానయ్య, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సంపత్, ఆర్టీఓ వెంకటరమణ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూనె గింజల సాగును ప్రోత్సహించాలి

జిల్లాలో నూనె గింజల సాగును ప్రోత్సహించి సాగు విస్తీర్ణం పెంచాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. గురువారం నిర్వహించిన నూనె గింజల మిషన్ జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశంలో మాట్లాడారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు తదితర సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నూనె గింజల సాగుకు వ్యయం, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని, ఆదాయం ఎక్కువగా ఉంటుందని కలెక్టర్ జితేష్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, ఉద్యానవన శాఖాధికారి కిషోర్‌బాబు, కేవీకే శాస్త్రవేత్త నారాయణమ్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం దక్కాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: అందరికీ న్యాయం జరిగేలా న్యాయవ్యవస్థ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. గురువారం కొత్తగూడెం జిల్లా కోర్టులోని లైబ్రరీ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొత్తగూడెం జిల్లా మొదటి అదనపు జడ్జి ఎస్. సరిత, కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా రాజేందర్

కొత్తగూడెంటౌన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా ఎం.రాజేందర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

క్లుప్తంగా

యువజన సంఘాల పాత్ర కీలకం



మాట్లాడుతున్న కల్లూరి ధర్మేంద్ర

ములకలపల్లి: దేశ రక్షణలో విద్యార్థి యువజన సంఘాల పాత్ర కీలకమని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శులు కల్లూరి ధర్మేంద్ర, ఇటుకల రామకృష్ణ, వేముల కొండల్‌రావు అన్నారు. ములకలపల్లిలోని రాయల్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ప్రజా నాట్య మండలి బాధ్యుల వర్క్‌షాప్ నిర్వహించారు. లౌకిక భారతావనిలో మతం పేరుతో చిచ్చులు పెట్టడంతో ఉగ్రమూకలు ప్రజలపై ఆకస్మిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నిషేధిత ఉగ్రవాద సంస్థలు దేశంలో మారణహోమం సృష్టిస్తున్నాయన్నారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, బీకేఎంయూ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి వెంకటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఉప్పుశెట్టి రాహుల్, హరీశ్, అజిత్, ఎండీ యూసుఫ్, నరాటి రమేశ్, జబ్బార్, అనుమల సాయి తదిరులు పాల్గొన్నారు.

గిరిజనుల రుచులతో ఆకట్టుకోవాలి



మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: ఐటీడీఏలోని ట్రైబల్ మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులను గిరిజనుల రుచులతో ఆకట్టుకోవాలని ఏపీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. మ్యూజియం ప్రాంగణంలో స్టాళ్లు ఏర్పాటు చేసిన నిర్వాహకులతో వంటకాల తయారీపై గురువారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. స్టాళ్ల నిర్వాహకులు పరిశుభ్రత పాటించి నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. స్టాళ్ల ఎదుట కూర్చోవడానికి సౌకర్యాలు కల్పించడంతో పాటు తినుబండారాలు తయారు చేస్తున్న సిబ్బంది చేతులకు గ్లౌజులతో పాటు, తలకి రక్షణ కవచాలు తప్పనిసరిగా ధరించాలని ఆదేశించారు. ప్రతీది ఎంఆర్‌పీకే విక్రయించాలని, పర్యాటకులు కోరిన తినుబండారాలు అధిక ధరకు అమ్ముతున్నట్లు దృష్టికి వస్తే ఆ స్టాల్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, గిరిజన స్టాళ్ల నిర్వాహకులు సుధారాణి, రాజేందర్, భూలక్ష్మి, దినేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తిచేయాలి




లబ్ధిదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

పాల్వంచరూరల్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. మండలంలోని తోగ్గూడెంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను హౌజింగ్ పీడీ శంకర్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. పనుల వివరాలు, డబ్బుల జమ గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని చెప్పగా.. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. హౌజింగ్ బోర్డు ఏఈ రమేశ్, గ్రామ కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బీట్ ఆఫీసర్లపై సస్పెన్షన్ వేటు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం రేంజ్ పరిధిలోని మర్రిగూడెం సెక్షన్ ఎల్లాపురం బీట్ అధికారి చంద్రయ్య, సర్వాపురం బీట్ అధికారి నగేశ్‌ను సస్పెండ్ చేస్తూ డీఎఫ్‌ఓ కృష్ణగౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మర్రిగూడెం గ్రామ పంచాయతీ ఎల్లాపురం గ్రామ శివారులో అటవీ భూమికి పక్కనే సాగు చేసుకుంటున్న రైతులు సరిహద్దు ప్రాంతంలో పోడు నరకడాన్ని బీట్ అధికారుల నిర్లక్ష్యంగా నిర్ధారించి, అందుకు బాధ్యులైన ఇద్దరు బీట్ అధికారులను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో డీఎఫ్‌ఓ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

కొత్తగూడెం అర్బన్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. 5వ వార్డు నర్సు క్వార్టర్స్ ఏరియాలో ఇంటి ముందు గురువారం ఆడుతున్న బాలుడిపై రెండు కుక్కలు దాడి చేయగా చేతికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టి.. బాలుడిని ఆస్పత్రికి తరలించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.21,000

క్రీడలు లేని ప్రాంగణాలు

లక్ష్యానికి దూరంగా క్రీడా ప్రాంగణాలు

- పంచాయతీలకే పరిమితమైన క్రీడా కిట్లు
- జిల్లాలో 730 ప్రాంగణాలకు కిట్లు పంపిణీ
- వేసవి దృష్ట్యా వినియోగంలోకి తెస్తే మేలు



విద్యానగర్ క్రీడా ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు, పేరుకున్న చెత్తాచెదారం

చుంచుపల్లి: గ్రామాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు సమయంలో అధికారులు చూపిన ఉత్సాహం, వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో చూపకపోవడంతో మూడేళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఇక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కో ప్రాంగణానికి క్రీడా సామగ్రిని పంపిణీ చేసినా వాటిని బయటకు తీసి ఆటలు ఆడిన దాఖలాలు ఎక్కడా లేవు. గత ప్రభుత్వం 2022లో అనువైన స్థలాలను గుర్తించి క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. యువకులు ఆటలాడేందుకు ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్, లాంగ్ జంప్ కోర్టులను ఏర్పాటు చేయించడమే కాకుండా, కోచ్‌ల ద్వారా యువత, చిన్నారులకు శిక్షణ ఇవ్వాలని సూచించింది. కానీ, క్షేత్రస్థాయిలో క్రీడా ప్రాంగణాల లక్ష్యం ఆచరణకు ఆమడ దూరంలోనే ఆగిపోయింది. జిల్లాలో అనేక చోట్ల ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఏళ్లుగా చెత్తా చెదారం పేరుకుపోయి ఆదరణకు నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల ఏర్పాటు చేసిన ఐరన్ సామగ్రి దొంగల పాలైంది. అసెంబ్లీ ఎన్నికల ముందు కొన్ని క్రీడా పరికరాలను తెలంగాణ క్రీడాశాఖ ద్వారా హడావుడిగా పంపిణీ చేసింది. క్రికెట్, ఖో–ఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, స్కిప్పింగ్‌తో పాటు పలురకాల పరికరాలను గ్రామ పంచాయతీలకు అందజేసింది. వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా ఓ గదిలో మూలకు పడేశారు. అధికారులు క్రీడా పాంగాణాల్లో సరైన వసతులు కల్పించి, ఆట పరికరాలను వినియోగంలోకి తేవాలని యువకులు కోరుతున్నారు.

అలంకారప్రాయంగా ప్రాంగణాలు

గ్రామాల పారిధిలో అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వెచ్చించి తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. చాలా గ్రామాల్లో స్థలాల కొరత ఉండటంతో శ్మశానవాటికల పక్కన, పాఠశాలల ప్రాంగణాలు, ఖాళీగా ఉన్న కొద్ది పాటి స్థలాల్లో తెలంగాణ ప్రాంగణం పేరిట బోర్డు, వాలీబాల్ కోర్టు, వ్యాయామం చేసేందుకు రెండు పరికరాలు ఏర్పాటు చేసి నామ్‌కేవాస్తేగా వదిలేశారు. కొన్ని చోట్ల కేవలం క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డులు పెట్టి ఇతరత్రా వసతులను మరిచారు. ఇక పట్టణాల్లోనూ వార్డుకో క్రీడా ప్రాంగణం ఉండాల్సి ఉండగా స్థలం కొరత వల్ల నాలుగైదు వార్డులకు కలిపి ఒకదాన్ని ఏర్పాటు చేశారు. సరైన వసతులు కల్పించకపోవడంతో యువకులు, క్రీడాకారులు ఆటలు ఆడేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అటు గ్రామాల్లో క్రీడా ప్రాంగాణాల నిర్వాహణ సక్రమంగా లేకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా తయారయ్యాయి. మరోవైపు నిధుల కొరత వల్ల పంచాయతీలు వీటి నిర్వాహణ చేపట్టలేక పూర్తిగా గాలికొదిలేశాయని పలువురు అంటున్నారు.

అటకెక్కిన క్రీడా సామగ్రి

జిల్లాలో పలు క్రీడా ప్రాంగణాలకు 2023 అక్టోబర్‌లో 730 కిట్లను పంపిణీ చేశారు. ముందుగా మండల కేంద్రాలు, మున్సిపాలిటీలకు సరఫరా చేయగా అక్కడి నుంచి అధికారులు గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ఒక్కొక్క క్రీడా యూనిట్ విలువ రూ.63 వేలు. ఇందులో జిమ్ పరికరాలతో పాటు క్రికెట్, వాలీబాల్ ఆటలకు సంబంధించిన సామగ్రి ఉంది. కిట్లతో పూర్తిస్థాయిలో ఆటలాడిన దాఖలాలే లేవు. అటు పంపిణీ చేసిన క్రీడా కిట్లు చాలా చోట్ల వినియోగంలో లేక గ్రామ పంచాయతీ గదుల్లో మూలన పడేశారు. ఇప్పటికైనా క్రీడా ప్రాంగణాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రాంగణాలను అందుబాటులోకి తేవాలి



బీఆర్‌ఎస్ ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసి ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఈ క్రీడా ప్రాంగణాల్లో సరైన వసతులు లేకపోవడంతో అవి ఏళ్లుగా ఆదరణకు నోచుకోవడం లేదు. వీటిపై పర్యవేక్షణ కొరవడటంతో పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్నాయి. వేసవి సెలవుల దృష్ట్యా అధికారులు చొరవ తీసుకొని ప్రాంగణాలను వినియోగంలోకి తేస్తే యువతకు మేలు జరుగుతుంది.

–మచ్చా వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం



గ్రామీణ ప్రాంతాల్లో యువకుల కోసం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కొంత నిర్లక్ష్యానికి గురవుతున్న మాట వాస్తవమే. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో వీటి నిర్వాహణను చేపట్టాల్సి ఉంది. కొన్ని నెలలుగా నిధుల కొరతతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో పట్టించుకోవడం లేదు. వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిస్తాం.

–వి.చంద్రమౌళి, డీపీఓ

పెసలు.. ధర లేక దిగాలు

- ఉమ్మడి జిల్లాలో 10 వేల ఎకరాల్లో పంట సాగు
- ప్రభుత్వ కొనుగోళ్లు లేక వ్యాపారుల ఇష్టారాజ్యం
- క్వింటాకు రూ.2,500 మేర నష్టపోతున్న రైతులు



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన పెసలు

ఖమ్మంవ్యవసాయం: యాసంగిలో రైతులు సాగు చేసిన పెసర పంటకు కనీస మద్దతు ధర కరువైంది. ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం క్వింటాకు రూ.8,682గా మద్దతు ధర నిర్ణయించినా ఎక్కడా అది అమలు కావడం లేదు. పెసర పంట ప్రస్తుతం చేతికందుతుండగా, కొందరు రైతులు విక్రయిస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పంటకు వ్యాపారులు గురువారం గరిష్ఠంగా రూ.7,050 ధర నిర్ణయించగా, మోడల్ ధర రూ.6,200, కనిష్ఠ ధర రూ.4 వేలే అందుతోంది. జెండాపాట ధర గరిష్ఠ ధర ఖరారు చేస్తున్నప్పటికీ.. ఎక్కువ పంటను మోడల్, కనిష్ఠ ధరలకు కొనుగోలు చేస్తుండడంతో రైతులకు నష్టం ఎదురవుతోంది.

దిగుబడి అంతంతే..

ఈ ఏడాది ఉమ్మడి ఖమ్మం జిల్లాలో యాసంగి పంటగా 10 వేల ఎకరాల్లో పెసర సాగు చేశారు. సమృద్ధిగా నీరు ఉండడంతో ఎక్కువ మంది మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యత ఇవ్వడంతో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి పెసర విస్తీర్ణం తగ్గింది. నీటి తడులు సమృద్ధిగా అందించిన చోట ఎకరాకు 5 – 6 క్వింటాళ్లు, మిగతా ప్రాంతాల్లో 2 – 3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దిగుబడి తగ్గిన నేపథ్యాన ధర అయినా మెరుగ్గా ఉంటుందని భావిస్తే పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

డిమాండ్ ఉన్నా తక్కువ ధర

పెసల కొనుగోళ్లలో వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం క్వింటా పెసలకు రూ.8,682 మద్దతు ధర నిర్ణయించినా ఆ ధర రైతులకు లభించటం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే ఆ ధర దక్కే అవకాశం ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇదే అదనుగా వ్యాపారులే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారు. గ్రామాల్లో పంట నాణ్యత ఆధారంగా క్వింటాకు రూ.4 వేల నుంచి రూ.5,500 వరకు చెల్లిస్తుండగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో రూ.700 నుంచి రూ.7,300 వరకు ధర పలుకుతోంది. దిగుబడి తగ్గిన నేపథ్యాన పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో ఈ పరిస్థితి ఎదురవుతోందని రైతులు ఆరోపిస్తున్నారు.

మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు లేక..

పంట నాణ్యతగా ఉండడం.. డిమాండ్ ఉన్నప్పటికీ వ్యాపారుల తీరుతో క్వింటాకు రూ.2,500 వరకు రైతులు నష్టపోతున్నారు. నాణ్యత లేని పంటకు రూ.3,700కు మించి చెల్లించడంలేదు. పెసల విక్రయాలు ప్రారంభమై, రైతులు దోపిడీకి గురవుతున్నా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. రెండేళ్ల కిందటి వరకు నాఫెడ్ సహకారంతో మార్క్‌ఫెడ్ పెసలను కొనుగోలు చేయగా.. ప్రస్తుతం అలాంటి ఆలోచన ఏదీ లేనట్లు తెలుస్తుండగా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రమహాసభలు

తొలిరోజు ప్రదర్శన, బహిరంగ సభ



ఖమ్మం కాల్వొడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఖమ్మంమయూరిసెంటర్: విద్యా రంగ సమస్యలపై చర్చించి, పోరాట కార్యాచరణ రూపొందించేందుకు ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఐదో మహాసభలు వేదికగా నిలవనున్నాయి. ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ప్రాంగణంతోపాటు నగరంలోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట ఎర్రతోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 2002లో ఖమ్మంలో సంఘం రాష్ట్ర మహాసభలు జరగ్గా.. తెలంగాణ ఏర్పడ్డాక తొలిసారి ఇప్పుడు నిర్వహిస్తున్నారు. సభల్లో భాగంగా తొలిరోజైన శుక్రవారం జెడ్పీ సెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు భారీ ప్రదర్శన, ఆతర్వాత కళాక్షేత్రంలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. సభకు రాష్ట్ర నలుమూలల నుంచి 500మంది ప్రతినిధులతో పాటు జిల్లా నాయకులు పాల్గొననున్నారు. కాగా, సభలో ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ అధ్యక్షుడు వీ.పీ.సాను ప్రసంగించనుండగా.. సినీ నటుడు మాదాల రవి, ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ఉపాధ్యక్షుడు నితీష్ నారాయణ్, ఎమ్మెల్సీ, ప్రజా వాగ్గేయకారుడు గోరేటి వెంకన్న పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

- పాల ధర పెంపు, ఎప్పటికప్పుడు చెల్లింపులు
- రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ అమిత్‌రెడ్డి



ఖమ్మం డెయిరీలో పరిశీలిస్తున్న చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

ఖమ్మంవ్యవసాయం: పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ(విజయ డెయిరీ) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలో గురువారం రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పాల బిల్లుల చెల్లింపులో జాప్యం జరగకుండా ఎప్పటికప్పుడు చెల్లించడమేకాక గేదె పాల ధరను లీటర్‌కు రూ.5 పెంచామని తెలిపారు. అనంతరం ఇందిరా మహిళా డెయిరీ సభ్యులు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో సంఘాలను ఏర్పాటుచేసుకుని, సేకరించిన పాలను విజయ డెయిరీకి పంపిస్తున్నామని తెలిపారు. అనంతరం చైర్మన్ విజయ డెయిరీలోని వివిధ విభాగాలను పరిశీలించి డిప్యూటీ డైరెక్టర్ పి.మోహనమురళితో చర్చించారు. సంస్థ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రావు, అడిషనల్ డీఆర్‌డీఓ నూరుద్దీన్, పశుగణాభివృద్ధి సంస్థ జిల్లా చైర్మన్ కె.నాగేశ్వరరావు, మేనేజర్ మురళీకృష్ణ, ఉద్యోగులు నాగమణి, హనుమంత్, కృష్ణ, అనితకుమారి, నాగశ్రీ, శ్రీలత, అప్పారావు, వి.మురళీకృష్ణ, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సమీకృత మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పార్లర్‌ను చైర్మన్ అమిత్‌రెడ్డి ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, పువ్వాళ్ల దర్గా ప్రసాద్, దొబ్బల సౌజన్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు కిలోల గంజాయి సీజ్



నిందితులు, గంజాయిని చూపుతున్న అధికారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం మీదుగా ఒడిశా నుంచి గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకుని సీజ్ చేశారు. కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ గౌతమ్ కథనం ప్రకారం.. పట్టణంలోని కూనవరం రోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులకు పల్సర్ అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. ఇద్దరు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగుల్లో ఏడు కిలోల గంజాయి లభించింది. ద్విచక్ర వాహనంతో పాటు మొబైల్ సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, గంజాయి విలువ సుమారు రూ.3.5 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ వెల్లడించారు. తనిఖీల్లో సిబ్బంది హబీబ్‌పాషా, వెంకటనారాయణ, గురవయ్య, శ్రావణి, పార్థసారథి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది జైలు శిక్ష

భద్రాచలంటౌన్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వి.శివనాయక్ ఏడాది జైలు శిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. బుర్గంపాడుకు చెందిన ఆకుల లక్ష్మీనారాయణరెడ్డి వద్ద కేటీపీఎస్ సీనియర్ ఇంజనీర్ సరిగొమ్ముల యుగపతి రూ.6.50 లక్షలు తీసుకున్నాడు. అవి తీర్చేందుకు యుగపతి చెక్కు ఇవ్వగా బ్యాంకులో జమ చేస్తే తిరస్కరణకు గురైంది. దీంతో లక్ష్మీనారాయణరెడ్డి తన న్యాయవాది ద్వారా కోర్టులో కేసు వేయగా.. వాదనలు విన్న న్యాయమూర్తి శివనాయక్ యుగపతికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.6.50 లక్షలు పరిహారం చెల్లించాలని తీర్పు చెప్పారు.

గ్రామాల అభివృద్ధే పంచాయతీరాజ్ లక్ష్యం



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): గ్రామాల అభివృద్ధే పంచాయతీ రాజ్ శాఖ లక్ష్యమని, ఆ దిశగా గ్రామాల్లో పరిశుభ్రత పాటించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.నాగలక్ష్మి సూచించారు. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండలంలోని అబ్బుగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బి.చంద్రమౌళితో కలిసి ఆమె పాల్గొన్నారు. ప్రతి కుటుంబం తన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముగ్గురికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగగా.. ముగ్గురు గాయపడిన ఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ యాకూబ్‌అలీ కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు చారగళ్ల లక్ష్మయ్య, పుల్లమ్మ కుమారుడు రాంబాబు, కుమార్తె సుజాత (దివ్యాంగురాలు) ఉన్నారు. అదే గ్రామానికి చెందిన దారబోయిన నరేశ్ సుజాతతో చనువుగా ఉండటంతో వృద్ధ దంపతులు, కుమారుడు రాంబాబు వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న నరేశ్ కుటుంబీకులు మల్లాది మంగరాజు, మల్లేశ్వరరావు వారి ఇంటికి వెళ్లి గొడవ పడటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో లక్ష్మయ్య, పుల్లమ్మ, మల్లేశ్వరరావుకు గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గరీబ్‌పేటలో రూ.3.50 లక్షలు చోరీ

కొత్తగూడెంటౌన్: సుజాతనగర్ పంచాయతీ గరీబ్‌పేటలో ఓ ఇంట్లో గురువారం దాదాపు రూ.3,50,000 నగదుతో పాటు బంగారం చోరీకి గురైంది. రామవరం టూటౌన్ సీఐ రమేశ్‌కుమార్ కథనం ప్రకారం.. సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి కట్టబోయిన లింగమల్లు ఉదయం పనికి వెళ్లగా ఇంట్లో వాళ్లు ఊరికి వెళ్లారు. ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చోరబడిన దొంగలు బీరువా తలుపులు పగులగొట్టి అందులోని నగదు రూ.3,50,000లతో పాటు ఆరున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. స్థానికులు, బాధితుల సమాచారం మేరకు క్లూస్ టీంతో చేరుకుని వివరాలు సేకరించామని, లింగమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రమేశ్‌కుమార్ వెల్లడించారు.

చెల్లని చెక్కు కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం ప్రశాంతినగర్‌కు చెందిన పుచ్చకాయల అనంతరాములుకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ గురువారం తీర్పు చెప్పారు. రఘునాథపాలెం మండలం వీ.వీ.పాలెంకు చెందిన గుగులోత్ రామ్మూర్తి వద్ద అనంతరాములు 2021లో రూ.3.80లక్షలు తీసుకున్నాడు. ఈ అప్పు చెల్లించే క్రమాన 2022లో రూ.4.54లక్షలకు చెక్కు జారీ చేసినా ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. దీంతో విచారణ అనంతరం అనంతరాములుకు జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.4.54లక్షలు చెల్లించాలని న్యాయాధికారి తీర్పు చెప్పారు.

ఇంకో కేసులో మరొకరికి...

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో ఖమ్మం టేకులపల్లికి చెందిన గడ్డం ధనుంజయకు ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిందుప్రియ తీర్పు చెప్పారు. ద్వారకనగర్‌కు చెందిన పెంట్యాల వాసు వద్ద ధనుంజయ 2016లో రూ.5లక్షల అప్పు తీసుకుని 2018లో రూ.రూ.5లక్షలకు చెక్కు ఇచ్చాడు. కానీ ఈ చెక్కు చెల్లకపోవడంతో వాసు కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. ఈమేరకు నిందితుడికి జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.5లక్షలు చెల్లించాలని తీర్పు వెలువరించారు.

చేపల వలకు చిక్కిన మొసలి కళేబరం



చేపల వలలో చనిపోయి ఉన్న మొసలి పిల్ల

అశ్వాపురం: మండలంలోని తుమ్మలచెరువులో గురువారం చేపలు పడుతుండగా వలలో మొసలి పిల్ల చిక్కింది. అది కూడా చనిపోయి ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా.. ఎఫ్ఆర్‌ఓ రమేశ్, సెక్షన్ ఆఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో ఖననం చేశారు.


ఏడుగురిపై కేసు నమోదు

బూర్గంపాడు: పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు వెళ్లిన బీజేపీ మండల అధ్యక్షులు బీరక సాయిశ్రీనివాస్, గుణపాటి వెంకటరెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తులపై గురువారం బూర్గంపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేశ్ కథనం ప్రకారం.. జింకలగూడెం గ్రామం వద్ద పశువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బీరక సాయిశ్రీనివాస్, గుణపాటి వెంకటరెడ్డి వెళ్లారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన షేక్ లక్కు, ఇస్మాయిల్, నాగుల్‌మీరా, చాంద్‌బీ, హుస్సేన్, నాగుల్‌మీరా, ఎండీ మోహిన్ దాడికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. సాయిశ్రీనివాస్ తల్లి వెంకటరమణ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గుండాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందిన ఘటన ఆళ్లపల్లి మండలంలో చోటుచేసుకుంది. జూలూరుపాడుకు చెందిన కల్లెం సాయిచరణ్ కొంతకాలంగా ఆళ్లపల్లి మండలం అనంతోగులో ఆర్ఎంపీగా పనిచేస్తున్నాడు. గురువారం వేకువజామున సుమారు 3 గంటల సమయంలో జిన్నెలగూడెంలో వివాహానికి హాజరై వస్తున్న క్రమంలో రాయికి గుద్దుకుని బైక్ పల్టీకొట్టింది. గాయపడిన సాయిచరణ్‌ను స్థానికులు కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి కుక్కలదాడిలో 12 గొర్రెలు మృతి చెందిన ఘటన గురువారం వెలుగుచూసింది. రావికంపాడు గ్రామంలో ఆనంగి పెద్దపకీర్ తన గొర్రెలను ఇంటికి దూరంగా ఉన్న పాకలో ఉంచాడు. అర్ధరాత్రి వేళ కుక్కలగుంపు దాడి చేయడంతో 12 గొర్రెలు మత్యువాత పడ్డాయి. మరికొన్ని గాయాలపాలై అపస్మారకస్థితికి చేరాయి. గమనించిన బాధిత రైతు లబోదిబోమంటున్నాడు.

యువకుడి ఔదార్యం

కొత్తగూడెంఅర్బన్: ఏటీఎంలో దొరికిన డబ్బును పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగించి ఓ యువకుడు ఔద్యార్యం చాటుకున్నాడు. కొత్తగూడెంలోని యాక్సిస్ బ్యాంకు ఏటీఎంలో రామవరానికి చెందిన టంగుటూరి సుదీప్‌కు రూ.50 వేలు దొరికాయి. ఆ డబ్బును సుదీప్ బ్యాంకు అధికారులకు అందించి, వారి సమక్షంలో పోగొట్టుకున్న వ్యక్తికి అందించాడు. దీంతో బ్యాంకు అధికారులు, డబ్బు పోగొట్టుకున్న వ్యక్తి సుదీప్‌ను సన్మానించారు.



పోగొట్టుకున్న నగదును అందజేస్తున్న దృశ్యం